# ప్రజాశక్తి

గురువారం 24 జులై 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి


# కెజిహెచ్‌లో.. నిలిచిన హార్ట్ సర్జరీలు




## • 5 నెలలుగా రోగులకు తప్పని పాట్లు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కెజిహెచ్‌లో రోగులకు గుండె సంబంధిత శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. విభాగంలో వైద్యపరికరాలు మరమ్మత్తులకు గురికావడం, వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటుచేయడంలో ఆసుపత్రి అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపని కారణంగా పేద ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ గుండెకు సంబంధించిన ఆపరేషన్లు ప్రతి నెలా 30 నుంచి 40 వరకు జరుగుతుంటాయి. అటువంటిది ఐదు నెలల నుంచి మిషన్లు పనిచేయకపోవడంతో రోగులకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా కార్డియాలజీ విభాగంలో శస్త్రచికిత్సలు నిర్వహించే హార్ట్ లంగ్ మిషన్, టెంపరేచర్ కంట్రోల్ మిషన్ కాలపరిమితి ముగిసిపోవడంతో మూలకు చేరాయి. ఫలితంగా గుండె సంబంధిత రోగులకు శస్త్రచికిత్సలు ఐదు నెలలుగా పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రోగులు ఈ శస్త్రచికిత్సల కోసం రూ.5 లక్షలు నుంచి రూ.6 లక్షలు వెచ్చించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరుతున్నారని తెలిసింది. ఆ స్థోమత లేని నిరుపేదలు ప్రాణాలు వదిలేసే పరిస్థితి ఉంది. కెజిహెచ్‌కు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా, చత్తీష్‌గడ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా గుండె సంబంధిత రోగులు వస్తుంటారు. కెజిహెచ్‌లో శస్త్రచికిత్స (కార్డియో దోరాసిక్) విభాగంలో కీలకమైన హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్ పరికరాలు మూలకు చేరడంతో వైద్యనిపుణులు ఉన్నప్పటికీ చికిత్సలు అందడం లేదు. కవాటాల (వాల్వ్) మార్పిడి చికిత్సలు నిలిచిపోయాయి. 1996లో హిందుస్థాన్ షిప్ యార్డు ఆర్థిక సహకారంతో కెజిహెచ్‌లో ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత పిపిపి కింద హార్ట్ లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్‌కు ప్రతి నెలా అద్దె చెల్లిస్తూ సర్జరీలు చేశారు. కొత్త పరికరాలకు సుమారు రూ.3 కోట్లు అవసరమని ప్రతిపాదించి, ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ పరికరాలను హెచ్‌డిఎస్ ఫండ్ నుంచి కొనుగోలు చేసేందుకు నిధులు లేకపోడంతో, సిఎస్‌ఆర్ నుంచి నిధులు సమీకరణ చేయాలని భావిస్తున్నారు.

ఈ విషయమై కార్డియాలజీ విభాగానికి చెందిన ఒక అధికారి మాట్లాడుతూ, ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లిందని తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించారన్నారు. సిఎస్‌ఆర్ నిధుల నుంచి రూ.2 కోట్లు సమకూర్చడానికి ఏర్పాట్లు జరిగాయని తెలిపారు. ఆ నిధులు వస్తే అద్దె ప్రాతిపదికన హార్ట్ సర్జరీకి అవసరమైన మిషన్లను తీసుకొని వెంటనే సర్జరీలు ప్రారంభించాలని కలెక్టర్ చెప్పినట్లుగా తెలిపారు. కొత్త మిషన్లను కొనుగోలు చేసి, వాటిని ఇక్కడ బిగించి పనిలోకి తేవాలంటే కనీసం 3, 4 నాలుగు నెలలు పడుతుందని, అలా కాకుండా అద్దెకు మిషన్లను తీసుకొని హార్ట్ సర్జరీలు చేపట్టడం తొందరగా జరుగుతుందని భావించి ఆ ప్రతిపాదన చేశారని చెప్పారు.

### ప్రయివేటు దోపిడీ

కెజిహెచ్‌లో శస్త్రచికిత్సలు అవడంలేదని తెలుసుకున్న నగరంలోని ప్రయివేట్, కార్పోరేట్ ఆస్పత్రులు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నాయి. ఆరోగ్యశ్రీ పేరిట వెళ్లినా ప్రభుత్వం నుంచి సకాలంలో క్లైమ్‌లు రావడంలేదంటూ వైద్యం, శస్త్రచికిత్సలు చేసేందుకు నిరాకరిస్తున్నాయి. దీంతో ఈ సర్జరీలకు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ ఖర్చు చేయాల్సి వస్తుందని బాధితులు వాపోతున్నారు.




పెదకోటలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, గిరిజనులు

## హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా...

# నేడు బహిరంగ సభలు

### హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

### పెదకోట, చింతలపూడి పరిసర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం

**ప్రజాశక్తి - అనంతగిరి, దేవరాపల్లి విలేకరులు**

ఆదివాసీలకు, రైతులకు, ప్రజలకు నష్టం చేకూర్చే అదాని, నవయుగ హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఉద్యమం ఉధృత రూపం దాలుస్తోంది. ప్రాజెక్టుల ప్రతిపాదన వచ్చినప్పటి నుంచి అనేక రూపాల్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టిన ప్రజానీకం పెద్ద పోరాటానికి సిద్ధమవుతోంది. ఈ క్రమంలో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా గురువారం ఉదయం 10 గంటలకు అల్లూరి జిల్లా పెదకోట పంచాయతీ రేగులపాలెంలోనూ, మధ్యాహ్నం 2 గంటలకు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడిలోనూ భారీ బహిరంగ సభలు జరుగనున్నాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అల్లూరి, అనకాపల్లి, విజయనగరం జిల్లాల కార్యదర్శులు పి.అప్పలనర్స, జి.కోటేశ్వరరావు, తమ్మినేని సూర్యనారాయణ, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు తదితరులు పాల్గొని ప్రసంగించనున్నారు. గిరిజన, ప్రజా సంఘాల నేతలు, సర్పంచులు, ఎంపిటిసిలు, పీసా కమిటీ ఛైర్మన్లు ఈ సభల్లో పాల్గొనున్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సిపిఎం, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు.

### గ్రామాల్లో విస్తృత ప్రచారం

గురువారం జరిగే బహిరంగ సభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక


మిగతా 2లో..


## ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థుల ధర్నా

పురుగుల భోజనం పెడుతున్నారని

విసి కార్యాలయం వద్ద ఆందోళన


▶ వార్త మెయిన్‌లో..


## అనిల్ అంబానీకి భూముల కేటాయింపు ఆపాలి


▶ వార్త 5లో..


## ఏకపక్షంగా విభాగాల మార్పు తగదు

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్


▶ వార్త మెయిన్ లో..




హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్, హీరోయిన్ నిధి అగర్వాల్

## ఘనంగా హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్


వార్త మెయిన్‌లో..


# 6 నెలల్లో ప్రముఖ ఐటి కంపెనీలు



- టిసిఎస్, గూగుల్, ఇన్ఫోసిస్, సత్వ సంస్థల్లో లక్ష ఉద్యోగాలకు అవకాశాలు
- 51 గ్రామాల్లో రీ సర్వే పూర్తి...
- చెరువు గెడ్డల్లో ఆక్రమణలను తొలగిస్తాం...
- ఎండాడ సర్వే నెంబర్1పై విచారణ చేపడతాం
- 'ప్రజాశక్తి'తో విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగంలో అభివృద్ధి చెందడానికి విశాఖకు అపారమైన అవకాశాలున్నాయి. విశాఖ కేంద్రంగా పనిచేసేందుకు దేశంలోని ప్రముఖ ఐటి సంస్థలు ఉత్సాహం చూపుతున్నాయి. రాగల ఆరు నెలల్లో దేశంలోనే ప్రసిద్ధి గాంచిన టిసిఎస్, గూగుల్, ఇన్ఫోసిస్, సత్వ వంటి కంపెనీలు ఐటిలో పెద్ద ఎత్తున 'స్పేస్' క్రియేట్ చేసి సుమారు లక్ష వరకూ కొత్త ఉద్యోగ, ఉపాధికి మార్గం సుగమం చేసే ప్రణాళికలతో ఉన్నాయి. ఇది నా డ్రీమ్ (కల) అని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. రెవెన్యూ భూములు సర్వే వంటి అంశాలనూ ప్రస్తావించారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు రోడ్ల అనుసందానం స్పీడుగా జరుగుతుందన్నారు. రాగల రెండేళ్లలో పూర్తిస్థాయిలో ఐటి కార్యకలాపాలకు విశాఖ 'గ్లోబల్ కేపబుల్ సెంటర్' (జిసిసి)గా ప్రసిద్ధిగాంచేలాగ స్పేస్ క్రియేట్ చేయనున్నాం. ఇటీవల ప్రజాశక్తికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఇంటర్వ్యూ


మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయి..**

## హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నేడు బహిరంగ సభలు

గిరిజనులతో కలిసి పెదకోట, టముటు, రేగులపాలెం, కొండిభకోట, పినకోట ప్రాంతాల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెదకోట (రేగులపాలెం) ప్రాంతంలో రైవాడ, గోస్తనీ జలాలపై 1800 మెగావాట్ల సామర్థ్యంతో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మించేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణమైతే పెదకోట పంచాయతీలో ఐదు గ్రామాలు పూర్తిగా మునిగిపోతాయని తెలిపారు. పినకోట పంచాయతీ పరిధిలోని గ్రామాలు కూడా తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. దేవరాపల్లి మండలం చింతలపూడి, మారిక వద్ద శారదా నదిపై 900 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టు కడితే పరిసర ప్రాంతాల వారికి, రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. పై ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల రైవాడ ఆయకట్టు భూములు మొత్తం బీడు బారిపోతాయాని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ నగరానికి తాగునీటి సమస్య తలెత్తుతుందన్నారు. ఈ నేపథ్యంలో రైవాడ ఆయకట్టు రైతులు, గిరిజనులు చేస్తున్న పోరాటంలో చేతులు కలపాలని కోరారు. గురువారం జరిగే బహిరంగ సభలకు గిరిపుత్రులు, రైతులు, నీటి సంఘాల ఛైర్మన్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జన్ని ఈశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు.

## 6 నెలల్లో ప్రముఖ ఐటి కంపెనీలు

ఇచ్చారు.

**ఐటి కంపెనీల ఆహ్వానానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది?**

పలు ఐటి సంస్థలు విశాఖకు విచ్చేసేందుకు ప్లాన్ చేస్తున్నాయి. బిపిఒ కంపెనీల మాదిరి కాకుండా పూర్తిస్థాయి సాఫ్ట్‌వేర్ జాబ్స్‌ను సృష్టించడానికి ఎఎన్ఎస్ఆర్ సంస్థ 10వేల జాబ్స్ ఇచ్చేందుకు విశాఖకు రాబోతుంది. కనీస జీతం ఈ కంపెనీలో రూ.50వేలు ఉంటుంది. సత్వ కంపెనీకి ఐటి రుషికొండ హిల్ నెంబర్ 4పై సుమారు 25 ఎకరాలు స్థలం కేటాయింపు జరిగింది. ఈ కంపెనీ 25వేల ఉద్యోగాలు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే టిసిఎస్, గూగుల్, ఇన్ఫోసిస్ కూడా ప్లాన్ చేస్తున్నాయి.

**విశాఖలో అభివృద్ధి ప్రాజెక్టుల పరిస్థితిపై వివరించండి?**

భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు శరవేగంగా ముందుకు వెళ్తున్నాయి. దీనికి తగ్గట్టుగానే విఎంఆర్‌డిఎ రోడ్ల కనెక్టివిటీకి బహుముఖంగా ప్రణాళికలతో సిద్ధమైంది. 2026 సంవత్సరంలో భోగాపురం ఎయిర్‌పోర్టును పూర్తిస్థాయిలో నిర్మించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. విశాఖ నగరంలో రోడ్ల పనులు, మౌలిక వసతుల అభివృద్ధికి పలు ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని పనులు చేపట్టడం జరుగుతోంది.

**భూ సమస్యల పరిష్కారంపై రెవెన్యూ ఎలా ముందుకెళ్తోంది?**

ప్రభుత్వ భూములు ప్రధానంగా వాగులు, గెడ్డలను ఆక్రమించుకునే వారికి సంబంధించి ప్రభుత్వం జీవో నెంబర్ 30 విడుదల చేసింది. ఎంతటివారినైనా ఆక్రమణల నుంచి తొలగించడం జరుగుతోంది. ప్రభుత్వ పోరంబోకు భూములను ఎవరైనా ఆక్రమించుకుంటే వాటిని రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వానికి ఒక నివేదిక పంపించాం. వాగులు, గెడ్డల్లో ఆక్రమణలపై 4వేల అర్జీలు వచ్చాయి. నగరంలోని కెఆర్ఎం కాలనీ చెరువు పోరంబోకులో నిర్మాణాలు జరిగాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టాం. పరిష్కారానికి ఆదేశాలు వస్తే అమలు చేస్తాం. ఎండాడ సర్వే నెంబర్ 1 ప్రభుత్వ కొండను ఆక్రమించుకుని నిర్మాణాలు సాగించిన విషయంపైనా సమాచారం స్వీకరిస్తానని చెప్పారు.

**రెవెన్యూ రికార్డుల పరిశీలన, రీ సర్వే ఎలా సాగుతోంది?**

విశాఖ జిల్లాలో రెవెన్యూ విలేజీలు 151 వరకూ ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 70 మేర ఉన్నాయి. అర్బన్‌లో అధికంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని 70లో 51 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలను స్వీకరించి పొరపాట్లు జరిగితే సరిదిద్దుతున్నాం. భూమి మీద ఎవరున్నారు? రికార్డుల్లో ఏం నమోదు అయ్యింది? మొత్తం భూ విస్తరణ ఎంత? ప్రస్తుతం భూమిపై ఎవరున్నారు? వంటి వివరాలను ఆరా తీస్తున్నాం.

# సమయపాలన పాటించాలి

### జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

**ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ :** జివిఎంసి అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు కార్యాలయ పనివేళల సమయానికి తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ప్రజా ఆరోగ్య విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాటిస్టికల్ ఆఫీసర్ పిడివి.ప్రసాదరావు చాంబర్‌లో బర్త్ అండ్ డెత్ వివరాలను, నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. నగరంలోని ఎన్ని హాస్పిటల్స్ నమోదు కలిగి ఉన్నాయని ఆరా తీశారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు సంబంధిత అర్జీల మేరకు వెంటనే జారీ చేసే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



విభాగాల్లో తనిఖీ చేస్తున్న జివిఎంసి కమిషనర్

**జివిఎంసి ఆదాయ పరిపుష్టికి కార్యాచరణ**

జివిఎంసి ఆదాయ పరిపుష్టికి అవసరమైన మార్గాలను అన్వేషించి కార్యచరణ చేపట్టాల్సిన బాధ్యత జివిఎంసి రెవెన్యూ అధికారులపై ఉందని కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్‌స్పెక్టర్లుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు, తాగునీరు, దుకాణాలు, వాణిజ్య, సముదాయాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లు, హాస్పిటల్స్ మొదలైన పన్నులతోపాటు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి పన్నులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వసూలు చేయాలన్నారు. అన్ని జోన్ల పరిధిలో ఆగస్టు 31వ నాటికి 50 శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

# పోర్టును సందర్శించిన ట్రెయినీ ఐపిఎస్‌లు

**ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ :** వివిధ రాష్ట్రాలకు చెందిన 28 మంది ట్రెయినీ ఐపిఎస్ అధికారుల బృందం బుధవారం విశాఖపట్నం పోర్టు అథారిటీని సందర్శించింది. సముద్ర భద్రతలో ఎదురయ్యే ఆధునిక సవాళ్ల గురించి అవగాహన పొందే ఉద్దేశంతో పోర్టును సందర్శించారు. సముద్ర భద్రతకు ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో, భారత ప్రభుత్వం శిక్షణలో ఉన్న అధికారులకు ఈ తరహా సందర్శనలను నిర్వహిస్తోంది. శిక్షణలో ఉన్న ఐపిఎస్ అధికారులకు పోర్టు అధికారులు సాదర స్వాగతం పలికారు. పోర్టులో జరుగుతున్న వివిధ కార్యకలాపాలు, అభివృద్ధి పనులను గురించి పోర్టు అధికారులు వివరించారు.

# అల్లిపురం శాఖా గ్రంథాలయం తనిఖీ

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** దక్షిణ నియోజకవర్గంలోని అల్లిపురం శాఖా గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దగ్గరలో ఉన్న స్కూల్ ప్రధానోపాధ్యాయులను కలిసి బుక్ ఫెస్టివల్, బుక్ షో, ఇతర కార్యక్రమాలను ఏర్పాటుచేసి పాల్గొనేలా కోరాలని ఆదేశించారు. గ్రంథాలయంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించాలని గ్రంథాలయ అధికారి పివి.నూకరాజుకు సూచించారు.

# 39వ వార్డులో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** జివిఎంసి 39వ వార్డులో వైసిపి వార్డు అధ్యక్షుడు ముజీబ్ ఖాన్ ఆధ్వర్యాన 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ, కూటమి పాలన పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయారన్నారు. కేవలం అమరావతి కోసమే వేలకోట్ల రూపాయలు అప్పు చేసి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షబీర బేగం, యాసిన్, గుండీల వెంకటరావు, తిట్టి కృష్ణ, మాలతి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

# కెజిహెచ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ల పనిపై సమీక్ష

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ఎన్‌టిఆర్ వైద్య సేవా విభాగానికి చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్ల (డిఇఒ)తో మెడ్‌కో డాక్టర్ యు.శ్రీహరి అధ్వర్యాన బుధవారం సమావేశం నిర్వహించారు. డిఇఒల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ, పేద రోగులను ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకం కింద నమోదు చేసి, మెరుగైన చికిత్స అందేటట్లు చూడాలని, ముందస్తు అనుమతుల ప్రక్రియ మొదలు క్లెయిమ్ ప్రాసెస్ పూర్తయినంత వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిఇఒలను ఆదేశించారు. వీరి పనితీరును రోజూ పర్యవేక్షించాలని వైద్య సేవా విభాగం మెడ్‌కో డాక్టర్ శ్రీహరిని ఆదేశించారు. ఈ సమావేశంలో అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ పాల్గొన్నారు.

## విమానాశ్రయంలో ఉచిత వైఫై సేవలు

**ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ :** విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల సౌకర్యార్థం యాక్టు ఫైబర్ నెట్ ఉచిత ఇంటర్నెట్ వైఫై సేవలను ఎయిర్ పోర్టు డైరెక్టర్ ఎన్.పురుషోత్తం బుధవారం ప్రారంభించారు. ఉచిత వైఫై సర్వీసు అందించేందుకు ముందుకొచ్చిన యాక్టు సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. యాక్టు వైస్ ప్రెసిడెంట్ సచిన్ రోషన్‌లాల్ మాట్లాడుతూ ప్రతి ప్రయాణికుడూ మొబైల్ ఒటిపి ద్వారా కనెక్టు అయి గంట సమయం ఉచితంగా ఈ వైఫై ఉచిత సేవలు పొందవచ్చన్నారు. ఎయిర్ పోర్టు ప్రాంగణంలోని కాన్ఫరెన్సు హాల్‌లో ఏర్పాటుచేసిన ఫ్రీ వైఫై జోన్ ప్రారంభ కార్యక్రమంలో యాక్టు సీనియర్ మేనేజర్ ప్రసాదరెడ్డి, ఎయిర్‌పోర్టు డిజిఎం ఆర్.భాస్కరరావు, ఐటి సహాయక ఇంజినీర్ సిహెచ్‌వివి. గణేశ్వరరావు పాల్గొన్నారు.

## స్పీచ్ థెరపీలో శిక్షణ

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** వికలాంగ పిల్లలకు స్పీచ్ థెరపీలో శిక్షణ కార్యక్రమం బుధవారం ఎన్‌జిజిఒఎస్ కాలనీ భవిత కేంద్రంలో చేపట్టారు. సీతమ్మధార, గోపాలపట్నం, మహారాణిపేట, పెందుర్తి, చినగదిలి మండలాలకు చెందిన 70 మంది వికలాంగ పిల్లలకు భాష ఉచ్ఛరణలో అభివృద్ధి సాధించేందుకు స్పీచ్ థెరపిస్ట్ బాలేశ్వరి మెళకువలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమకుమార్, జె.చంద్రశేఖర్, విద్యాశాఖ అధికారులు రామారావు, బాలమణి పాల్గొన్నారు.

# భద్రయ్యపేటలో భయం..భయం..!

- కిడ్నీ వ్యాధులతో అల్లాడుతున్న ప్రజలు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురితోపాటు ఇప్పటికే పది మందికిపైగా మృత్యువాత
- గ్రామంలో పదుల సంఖ్యలో బాధితులు
- వైద్య పరీక్షల్లో రోగనిర్ధారణతో భీతిల్లుతున్న జనం



భద్రయ్యపేటలో అధ్వానంగా ఉన్న పరిస్థితులు

**ప్రజాశక్తి-పద్మనాభం** : మండలంలోని రెడ్డిపల్లి మేజర్ పంచాయితీ శివారు గ్రామమైన భద్రయ్యపేటలో జనం కిడ్నీ వ్యాధితో అల్లాడిపోతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురితోపాటు ఇప్పటికే పదిమందికిపైగా వ్యాధి బారిన పడి మృత్యువాత పడడం, పదుల సంఖ్యలో బాధితులు ఉండడంతో గ్రామంలో భయాందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చుట్టుపక్కలా ఉన్న క్వారీల వల్ల భూగర్భ, ఉపరితల జలాలు కాలుష్య కారకం కావడంతో భద్రయ్యపేటలో ప్రజల బతుకులకు భద్రత లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

భద్రయ్యపేటలో 150 కుటుంబాలకు చెందిన 360 మంది నివసిస్తున్నారు. కొన్నాళ్లుగా గ్రామస్తులు నడుము నొప్పి, నీరసం, కాళ్ల, ఒంటి నొప్పులు వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. అయితే ప్రాణాంతక కిడ్నీ సంబంధిత వ్యాధిగా అనుమానించని పలువురు సాదారణ చికిత్స తీసుకోవడం, ఆరోగ్యం విషమించి, పది మందికి పైగా మృత్యువాత పడ్డారు. ఒకే కుటుంబంలోని అన్నదమ్ములతో పాటు వదిన, సోదరి ఈ మహమ్మారి వ్యాధికి ప్రాణాలు కోల్పోయారు. ఇంకా అనేకమంది వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నారు. అయితే వ్యాధి ఉందని తేలితే పనులకు వెళ్లలేమన్న భయంతో వైద్యపరీక్షలకు ఎవరూ సాహసించడం లేదు. అయితే పరిస్థితి విషమంగా మారడంతో ఎట్టకేలకు 70మంది వరకు రేవిడి పిహెచ్‌సికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోగా, వారిలో 50మందికి వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి. దీంతో ఈనెల 21న కలెక్టరేట్ పిజిఆర్ఎస్‌లో గ్రామానికి చెందిన అలబాని సూరిబాబు ఆధ్వర్యంలో కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి, 22న ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ హరీష్‌రావు ఆధ్వర్యంలో తాగునీటి నమూనాలను సేకరించి, పరీక్షలు చేసినా ఏదీ లేదని తేల్చారు. అయితే వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న రేవిడి పిహెచ్‌సికి తీసుకెళ్లి రక్తపరీక్షలు చేయించగా, వారిలో 50మందికి క్రియాటనిన్ లెవెల్స్ సాదారణం కన్నా ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించడంతో బుధవారం డిఎంహెచ్‌ఎ డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎం డిపిఎంఒ డాక్టర్ బి.ఉమావతి, స్థానిక పిహెచ్‌సి వైద్యులు, సిబ్బందితోకూడిన వైద్యబృందం గ్రామాన్ని సందర్శించి పరిస్థితి ఆరా తీశారు. వ్యాధి లక్షణాలున్న వారిని వెంటనే విశాఖ కెజిహెచ్‌కు తరలించాలని ఆదేశించారు.

### గుక్కెడు నీళ్లు తాగాలంటే భయం

భద్రయ్యపేట గ్రామానికి ఇరువైపులా క్వారీలు ఉండడంతో వాటి నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఇక్కడి భూగర్భజలాల్లో ప్రమాదకర రసాయనాలు వున్నాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఇక్కడి బోర్ల నుంచి బిందెను నీటిని పట్టి రాత్రంతా ఉంచితే, ఉదయానికి నురగలా పొంగి, బిందె మొత్తం గ్రీజు అంటుకున్నట్టు తయారౌతోందని,అడుగుభాగాన తెల్లని సున్నపు పొర ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అదే నీటిని వాడడం వల్లే నేడీ దుస్థితికి చేరుకున్నామని వారంతా ఆవేదన చెందుతున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నీటి విశ్లేషణలో ఏమీ లోపం లేదంటూ వచ్చిందని చెప్పడంపై వారంతా మండిపడుతున్నారు.

### అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి

భద్రయ్యపేటలో కిడ్నీ వ్యాధులు తీవ్రంగా ఉన్నాయని స్పష్టం కావడంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. వ్యాధిపీడితులకు మెరుగైన వైద్యం అందిస్తూనే, దీనికి కారణాలపై విశ్లేషించాలని, వాటిని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు ఇక్కడి భూగర్భజలాలు కలుషితం కావడంతో దానికి కారణాలను అన్వేషించాలని, ప్రజలకు రక్షితనీటిని అందించే చర్యలు తక్షణం చేపట్టాలన్నారు. ప్రమాదకారక క్వారీలను తరలించాలని కోరుతున్నారు.



భద్రయ్యపేటలో ప్రజలతో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ జగదీశ్వరరావు

## మెరుగైన చికిత్సకు ఆదేశం



కెజిహెచ్‌లో కిడ్నీ వ్యాధిగ్రస్తులతో వైద్య బృందం

**విశాఖ కలెక్టరేట్** : భద్రయ్యపేట నుంచి 47మంది కిడ్నీ బాధితులను రేవిడి పిహెచ్‌సి హెల్త్‌సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో బుధవారం కెజిహెచ్ నెఫ్రాలజీ ఒపిడికి తీసుకురాగా, . నెప్రాలజీ విభాగం ఇన్‌చార్జి ఫ్రోఫెసర్, డాక్టర్ డి.రాధాకృష్ణన్ పర్యవేక్షణలో వారికొి కిడ్నీ పరీక్షలు, ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించారు. వీరిలో ఎనిమిది మందికి క్రియాటనిన్ లెవెల్స్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. వీరందరిని మరింత క్షుణ్ణంగా పరిక్షించి, ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని, వ్యాధి నిర్ధారణ తర్వాత పూర్తి స్థాయిలో మెరుగైన చికిత్స అందించాలని, సిఎస్ఆర్ ఎంఒ డాక్టర్ శ్రీహరిని సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ఆదేశించారు.

## నేరాలు ఘోరాలు

### స్టీల్ ప్లాంట్ మాజీ ఉద్యోగి ఆత్మహత్య

**ప్రజాశక్తి-ఉక్కునగరం** : స్టీల్ ప్లాంట్‌లో తన ఉద్యోగం పోవడం, కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న తన తండ్రికి ఉద్యోగం నుంచి తొలగించడం, ఇటీవల తల్లి మరణించడంతో ఇలా వరుస ఘటనలతో మనస్థాపం చెందిన శ్రీనివాస్ అనే స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి మృతి చెందిన సంఘటన వడ్లపూడి. తిరుమల నగర్‌లో చోటు చేసుకుంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లోని ఆర్ఎంహెచ్‌పి విభాగంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ తల్లి మంగమ్మ ఇటీవల మరణించింది. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన శ్రీనివాస్, ఇంటికే పరిమితమై తరచూ విధులకు గైర్హాజరు కావడం, సంబంధిత విభాగం నుంచి నోటీసులు అందించినా స్పందించపోవడంతో ఏప్రిల్ 27న దీనిపై డిసిప్లినరీ కమిటీ నివేదించారు. అనేక అవకాశాలిచ్చినా స్పందన లేకపోవడంతో కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి ఈనెల 12న శ్రీనివాసులును విధుల నుంచి తొలగించారు. ఇదే సమయంలో విశాఖ ఉక్కు యాజమాన్యం తండ్రి కాంట్రాక్టు ఉద్యోగాన్ని అర్థాంతరంగా నిలిపేయడంతో మరింత కుంగిపోయి మంగళవారం రాత్రి పడకగదిలో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్య వేసుకున్నాడు. తండ్రి అప్పలరాజు ఫిర్యాదుతో దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి- ఆనందపురం** : మండలంలోని పెద్దిపాలెం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు విజయనగరం జిల్లా నెల్లిమర్ల, రామతీర్థం, బైరెడ్డి వీధి చెందిన సప్పిడి అప్పారావు ( 40) మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మండలంలోని పెద్దిపాలెం వద్ద అమన్ దాబా సమీపంలో జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలైన అప్పారావును 108 అంబులెన్స్ ద్వారా కెజిహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు మృతుని సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు అనందపురం సిఐ వాసు నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సిసి కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నారు.

### సౌత్ సబ్ డివిజన్ ఎసిపిగా శ్రీనివాసరావు

**ప్రజాశక్తి -గాజువాక** : సౌత్ సబ్ డివిజన్ గాజువాక ఎసిపిగా పి.శ్రీనివాసరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు గాజువాక, దువ్వాడ, స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్ సిఐలు పార్థసారథి, మల్లేశ్వరరావు, కేశవరావు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎసిపి శ్రీనివాసరావు మాట్లాడుతూ, సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.



## వాలీబాల్ క్రీడాకారునికి అభినందన

**ప్రజాశక్తి -గాజువాక** : థాయిలాండ్‌లో జరిగిన అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన భారత జట్టు సభ్యుడైన వడ్లపూడి కణితి గ్రామానికి చెందిన అట్టాడ చరణ్‌ను పలువురు అభినందనలతో ముంచెత్తారు. ఈ నెల 19 వరకు థాయిలాండ్‌లో జరిగిన రెండవ ఏషియన్ అండర్-16 (మెన్) వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రా తరపున తొలిసారిగా భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వైజాగ్ క్రీడాతేజం చరణ్ జట్టు విజయంలో కీలకభూమిక పోషించాడు. చరణ్ ప్రతిభను జట్టు యాజమాన్యం, ఇండియన్ వాలీబాల్ ఫెడరేషన్ ప్రశంసించింది.

అంతకుముందు ఈ నెల 10వరకు బెంగళూరు ఎన్ఎస్-ఎస్‌సి అకాడమీలో జరిగిన శిక్షణా శిబిరంలో చక్కని క్రమశిక్షణతోపాటు అత్యుత్తమ ఆటతీరుతో సెలక్టర్లను ఆకట్టుకున్నాడు. అమ్మమ్మ ఇంట్లో పెరిగిన చరణ్, ఉక్కునగరం డిఎవి స్కూల్‌లో చదువుతున్నప్పుడే, పాఠశాల తరపున పలుపోటీల్లో పాల్గొని రాణించాడు. స్కూల్ యాజమాన్యం, పిఇటి మల్లేశ్వరరావు ప్రోత్సాహంతో సాయి అకాడమీ( స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఇండియా)కి ఎంపికై, కోచ్ సత్యనారాయణ ప్రోద్బలంతో వాలీబాల్‌లో మెళకువలను నేర్చుకుని, బెంగళూరులో నిర్వహించి జట్టు ఎంపికలో స్థానం సంపాదించాడు. 2024లో జార్ఖండ్‌లో జరిగిన సిబిఎస్ఇ నేషనల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన చరణ్, ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన నేషనల్ వాలీబాల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి, జట్టు కాంస్యపతకం సాధించడంలో ముఖ్యపాత్ర పోషించాడు. .

చరణ్ తల్లిదండ్రులు అట్టాడ కమల్‌నాభం, దేవి. వ్యవసాయ కుటుంబం కాగా, అన్నయ్య భార్గవ్ ఇంజనీరింగ్ ఫస్టియర్. మామయ్యలు దుగ్గపు దానప్పలు, దుగ్గపు రవి ప్రేరణ, . కోచ్ సత్యనారాయణ ప్రోత్సాహంతో వాలీబాల్‌లో రాణిస్తున్నామని చరణ్ అంటున్నాడు. చరణ్ రాష్ట్రమంత్రి రాంప్రసాద్ రెడ్డి, గాజువాక ఎమ్మెల్యే, పల్లా శ్రీనివాసరావు, వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, పి.గణబాబు, సాయి అకాడమీ ఇన్‌ఛార్జి కోచ్ సత్యనారాయణ, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అభినందించారు.




చరణ్‌కు పలువురి అభినందన

# మహిళల హక్కుల రక్షణకు ఉద్యమిద్దాం

## ఐద్వా మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యవతి

ప్రజాశక్తి-మధురవాడ : మహిళల రక్షణకు, హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దామని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి పిలుపునిచ్చారు.బుధవారం కొమ్మాది జంక్షన్‌లోని త్రిశక్తి కల్యాణ మండపంలో ఐద్వా మద్దిలపాలెం జోన్ కమిటీ 5వ మహాసభ ఎస్.రంగమ్మ, ఎం.మౌనిక, కె.సుజాత అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభానికి ముందు కెప్టెన్ లక్ష్మీ సెహగల్ చిత్రపటానికి ఐద్వా సీనియర్ నాయకులు నూర్జహాన్ బేగం, శారద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు బి.పద్మ ప్రారంభోపన్యాసం చేస్తూ నేడు భారతదేశంలో మహిళలపై హింస తీవ్రతరం మైందన్నారు. మహిళ రక్షణే మా ధ్యేయమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నదానికి, ఆచరణకు భిన్నంగా ఉందన్నారు. చట్టాలన్నీ నేరస్తులకు చుట్టాలుగా మార్చుకునే విధంగా పాలకవర్గాలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. డ్వాక్రా సంఘాలకు సున్నావడ్డీకే రుణాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వాటిని తుంగలోతొక్కిందన్నారు. శ్రామిక మహిళలపై పనిభారం పెంచడం, వేధింపులకు గురిచేయడం, రాత్రి సమయంలో కూడా మహిళలు పనులు చేయాలని నేరుగా ప్రభుత్వాలే నిర్ణయాలు చేయడాన్ని బట్టి మహిళలకు స్వేచ్ఛ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మరోవైపు స్వయంపోషక, ఒంటరి మహిళలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేదన్నారు. విద్యుత్, పెట్రోల్, గ్యాస్, డీజిల్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెంచి మహిళలను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లు పెట్టి సమాజాన్ని చీకటి రాజ్యంలోకి నెడుతున్నారని మండిపడ్డారు. ఆయా సమస్యలపై మహిళలందర్నీ ఐక్యంగా కదిలించడానికి ఐద్వా స్థానిక సంఘాలు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు.




నూతనంగా ఎన్నికైన ఐద్వా మద్దిలపాలెం జోన్ కమిటీ

**నూతన కమిటీ ఎన్నిక**

మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ ప్రాంతాలుగా ఉన్న మూడు వేర్వేరు కమిటీలను ఒక్కటిగా కలిపి మద్దిలపాలెం జోన్‌గా మహాసభ జరిపారు. నూతన కమిటీ అధ్యక్షులుగా బి.భారతి, ప్రధాన కార్యదర్శిగా డి.కొండమ్మ, కోశాధికారిగా వి.శాంతి, ఉపాధ్యక్షులుగా కె.కుమారి, ఎస్.గౌరి, సహాయ కార్యదర్శిగా కె.సుజాత, ఎం.మౌనికలతో పాటు పి.విజయ, కె.పుష్ప, ఎస్.రంగమ్మ, వై.పార్వతి, పి.మణి, బి.లక్ష్మిలను కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చేనెల 11న మద్దిలపాలెం జోన్‌లో నిర్వహించే విశాఖ జిల్లా ఐద్వా మహాసభల జయప్రదానికి కృషి చేయాలన్నారు.

## నిత్యాన్నదానికి రూ.1.50లక్షల వితరణ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్న దేవస్థానంలో నిత్యాన్నదాన ప్రసాద వితరణకు నగరంలోని సిరిపురం బాలాజీ నగర్‌కు చెందిన ఎస్‌బిఐ పెన్షనర్స్ క్లబ్ రూ.1.50లక్షల నగదును వితరణగా అందజేసింది. విరాళాన్ని ప్రోటోకాల్ ప్రకారం దేవస్థానం ఖాతాలో జమ చేసి, దానిపై వచ్చే వడ్డీతో ఏటా ఏప్రిల్ 26న విశాఖఎస్‌బిఐ పెన్షనర్స్ అసోసియేషన్, అమరావతి సర్కిల్ తరపున భక్తులకు అన్నదానం చేయాలని కోరారు. దేవస్థానం ఇఇ కె.తిరుమలేశ్వరరావు, జూనియర్ సహాయకుడు వరాహ నరసింహం పెన్షనర్స్ క్లబ్ సభ్యులను అభినందించి, నిత్య అన్నప్రసాద బాండు అందజేశారు. స్వామి దర్శనాన్ని కల్పించి ప్రసాదాలను అందజేశారు.

## అశోక్‌గజపతిరాజుకు అభినందన

ప్రజాశక్తి- మాధవధార :గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును బుధవారం విజయనగరంలోని ఆయన బంగ్లాలో బిజెపి నేత, వికసితభారత్ 2047 జిల్లా కోకన్వీనర్ మూల వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ రాజకీయాల్లో అవినీతి మరకలేని, నిజాయితీపరుడైన అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి రావడం ముదావహమన్నారు. ఇప్పటివరకు చేపట్టిన పదవులకే వన్నెతెచ్చిన అశోక్ గజపతిరాజు, గోవా గవర్నర్‌గా రాణించి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

## బదిలీ ఉద్యోగులకు వీడ్కోలు

ప్రజాశక్తి-గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డులో ఏడేళ్లుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న నలుగురు శానిటరీ సెక్రటరీలు చంద్రరావు, శివబాబు, చిరంజీవి, కుసుమలను వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ స్థానిక కల్యాణమండపంలో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వార్డులో ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించిన వారంతా ఎక్కడకు వెళ్లినా అదే పనితీరును కనపర్చి మంచిపేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బొడ్డేటి విజయకుమార్, శానిటరీ సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణా దుర్మార్గం

ప్రజాశక్తి-సీతమ్మధార : మానవ అక్రమ రవాణా దుర్మార్గమని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్.ఎస్.దివాకర్ అన్నారు. ఈనెల 30న అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భాన్ని పురస్కరించుకొని బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం సీతమ్మధారలోని తన కార్యాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో మానవ అక్రమ రవాణా ఒకటని, . ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ఈ.అనాగరిక చర్యను అరికట్టవచ్చన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక.కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్‌బాబ్జీ. మహ్మద్‌హుస్సేన్, అప్పారావు పాల్గొన్నారు.

## దర్గాలో ఘనంగా చందనోత్సవం

ప్రజాశక్తి- సీతమ్మధార: అక్కయ్యపాలెం జాతీయ రహదారి సమీపంలోని తాజ్ బాగ్ దర్గాలో హజరత్ తాజుద్దీన్ బాబా72వ చందనోత్సవం ఉర్సు కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. తాజ్‌బాగ్ దర్గా నుంచి కోటవీధిలోని హజరత్ ఇషాక్ మదని ఔలియాదర్గాకు చేరుకొని, తిరిగి అక్కయ్యపాలెం తాజ్ బాగ్ దర్గాకు సందల్ ఊరేగింపు జరిగింది. ఫకీర్ మేళా, బ్యాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి తాజ్ బాగ్ దర్గాలో గల హజరత్ తాజుద్దీన్ నిషానిపై సందల్ పూసి, చాదర్ (పవిత్ర వస్త్రం) వేసి గులాబీ పువ్వులు సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు ఫాతేహా, అనంతరం, సలాతు సలాం, ప్రసాద వితరణతో చందనోత్సవం వైభవంగా జరిగింది.కార్యక్రమంలో హిందూ, ముస్లిములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఉచిత కుట్టు-శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -ఆనందపురం : సత్యసాయి సేవా సంస్థల దత్తత గ్రామమైన చందకలో మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణా కేంద్రాన్ని జిల్లా అధ్యక్షుడు పిఆర్‌ఎస్ఎన్. నాయుడు ప్రారంభించారు. జిల్లా మహిళ సేవాదళ్ కోఆర్డినేటర్ కెవిఎల్. ఈశ్వరి ఆర్‌వి. నాయుడు, సత్యనారాయణ, అప్పారావు, కోరాడ తమ్మునాయుడు, డి. శరత్‌కుమార్, బి.కృష్ణమూర్తి రాజు, సునీత, వరం, రోహిణి పాల్గొన్నారు

# యూనివర్శిటీ పేపర్ లీక్ చిత్రాన్ని ఆదరించండి

## సినీ నటులు ఆర్.నారాయణమూర్తి



మాట్లాడుతున్న నారాయణమూర్తి, పక్కనే స్టీల్ సిఐటియు నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : తాను నిర్మించిన 'యూనివర్సిటీ పేపర్ లీక్' చిత్రం వచ్చేనెల 22న విడుదల కానుందని, దాన్ని థియేటర్లలో చూడాలని సినీ నిర్మాత, నటుడు, దర్శకుడు, పీపుల్ స్టార్ ఆర్ నారాయణ మూర్తి తెలిపారు. ఉక్కు సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రస్తుతం విద్యా వ్యవస్థలో లక్షలు ఖర్చుపెట్టి, కష్టపడి పోటీ పరీక్షలకు రాస్తుంటే కొంత మంది కార్పొరేట్ సంస్థల స్వార్థపూరిత వ్యాపార దురహంకారం మూలంగా వాళ్ళ సంస్థల్లో ఉన్న వారికే ర్యాంకులు రావాలని, వారి వద్ద ప్రి పేపర్ అవుతున్న వారికే ఉద్యోగాలు రావాలని పేపర్ లీకులకు పాల్పడుతున్నారన్నారు. దీనివల్ల డబ్బున్న కొందరికే లబ్ధి చేకూరుతూ, పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు.

ఇటీవల మెడికల్, నీట్, ఎంసెట్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల పేపర్ లీకేజీలు, వాటివల్ల ఎంతోమంది విద్యార్థులు, ఉద్యోగార్థులు ఆత్మహత్యలు చేసుకున్నాయన్నారు. ఆయా అంశాలను ఇతివృత్తంగా తీసుకుని చిత్రాన్ని నిర్మించామన్నారు. విద్యార్థులందరూ ఈ చిత్రాన్ని తిలకించి విద్యారంగంలో జరుగుతున్న అన్యాయాలను, దోపిడీలకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేయాలని చిత్రాన్ని ఆదరించి జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమం ఏర్పాటు చేసిన ఎస్‌ఎఫ్ఐ నాయకులకు, పాల్గొన్న ఇతర విద్యార్థి సంఘాలకు, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై వ్యతిరేక వ్యక్తం చేస్తూ, కార్మికుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె అయోధ్యారాం యు రామస్వామి, దీనబంధు, మహేశ్వరరావు, యువి రావు గంగాధర్, టీవీ కృష్ణంరాజు పాల్గొన్నారు.


## ఐటిడిపి అధ్యక్షునిగా అప్పలరాజు



సూరిశెట్టి అప్పలరాజు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఐటిడిపి అధ్యక్షునిగా 70వ వార్డుకు చెందిన సూరిశెట్టి అప్పలరాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, తమ కుటుంబ మంతా టిడిపి అభిమానులేనని, పార్టీ తనకిచ్చిన గౌరవాన్ని ఎన్నటికీ మరువలేనన్నారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేస్తానన్నారు తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, గాజువాక సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లరకు ధన్యవాదాలు తెలిపారు.

## విమ్స్‌కు వెంటిలేటర్ వితరణ




వెంటిలేటర్ అందజేస్తున్న ఇండస్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)కు ఇండస్ ఆసుపత్రి వెంటిలేటర్ వితరణ చేసింది. బుధవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబుకు ఇండస్ ఆస్పత్రి ఎండి డాక్టర్ శ్రీధర్ వెంటిలేటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ అత్యవసర రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వెంటిలేటర్ వితరణ చేయటం అభినందనీయ మన్నారు. తమ వద్ద ఉన్న వెంటిలేటర్లకు అదనంగా మరొకటి జత కలవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఇండస్ ఆసుపత్రి సిఇఒ చంద్రమౌళి, జిఎం ఆపరేషన్స్ సుధీర్ పాల్గొన్నారు

# నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి

ప్రజాశక్తి- వేపగుంట : విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని గోపాలపట్నం ట్రాఫిక్ సిఐ కె. సురేష్ సూచించారు. బుధవారం సింహాచలం మినర్వా పాఠశాలలో నాయకత్వ ప్రవేశ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులను బ్రహ్మగుప్త, ఆర్యభట్ట, రామానుజ, భాస్కరాచార్య నాలుగు గ్రూపులుగా విభజించి, సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఒక్కో గ్రూపునకు ఎస్‌పిఎల్, ఎఎస్‌పిఎల్‌ల ఎన్నిక నిర్వహించగా, ఎన్నికైన వారిని అభినందించి, బ్యాడ్జీలను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా సిఐ సురేష్ మాట్లాడుతూ, చదువుతోపాటు సమాజాన్ని గూర్చి విద్యార్థులు ఆలోచించాలని, స్నేహపూరిత వాతావరణంలో సమాజాన్ని మంచి మార్గంలో నడిపించాలే తప్ప దండనతో కాదని నేటి పోలీసు విధానాన్ని వివరించారు. నేటి సమాజంలో తల్లిదండ్రుల బాధ్యతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. ముందుగా మినర్వా పాఠశాల అకడమిక్ డైరెక్టర్ అవినాష్ పుష్పగుచ్ఛంతో సిఐని స్వాగతించగా, ప్రిన్సిపల్ సోమేష్ అభినందించారు. అకాడమిక్ డైరెక్టర్ డివి రామరాజు అవినాష్ మాట్లాడుతూ విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు..

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-భీమునిపట్నం : రెండో వార్డు ఇడ దాసరిపేటలో జివిఎంసి నిధులు రూ 47.15 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, జెడ్సి బమ్మి అయ్యప్పనాయుడు, జెడ్‌పిటిసి గాడు వెంకట ప్పుడు, పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్ రాజు,



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పార్టీ నాయకులు కొప్పల రమేష్, గొలగాని నరేంద్ర కుమార్, తమ్మిన సూరిబాబు, దండి వెంకటేష్, చెట్టి అశోక్ చక్ర వర్తి పాల్గొన్నారు.

## జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో రజతం

ప్రజాశక్తి-పెందుర్తి : పంజాబ్ రాష్ట్రం, జలంధర్‌లో నిర్వహించిన జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖపట్నం పిఎంశ్రీ విజయనగర్ కేంద్రీయ విద్యాలయ-1 జట్టు రజత పతకాన్ని సాధించింది. కోచ్ శ్రావణి ఆధ్వర్యంలో చంద్రిక, సౌమ్య, సరిత, అరణ్య, శ్రీనిధి, కేసవి, బ్యూలా, శృతి, కీర్తన, లక్ష్మీ ప్రియ, లాస్య ప్రతీత శిరీష విద్యార్థులతో కూడిన జట్టు పోటీల్లో రాణించి రన్నరప్‌గా నిలిచారు. విద్యార్థులను ఇండో హ్యూమన్‌రైట్స్ కేర్ జాతీయ చైర్మన్ రాజాన ప్రసాదరావు, పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థినులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపల్ కిశోర్, కోచ్ శ్రావణిలను అభినందించారు.

# అనిల్ అంబానీకి భూముల కేటాయింపు ఆపాలి

## సిపిఎం నేతలు లోకనాథం, కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాంబిల్లి మండలం లోవపాలెం, గసిరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం, లాలం కోడూరు తాటిమెట్ట, ద్వారపూడి గ్రామాల్లో సోలార్ థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం కోసం అనిల్ అంబానీకి 1500 ఎకరాలను కేటాయిస్తూ చేస్తున్న ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనిల్ అంబానీ బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంకులో రుణ ఎగవేతదారుడిగా ప్రకటించాయని తెలిపారు. అటువంటి వారికి భూములు కేటాయించడం వల్ల కంపెనీలు రాకపోగా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఎస్ఈజెడ్ ప్రాంతంలో గతంలో సేకరించిన భూములు ఖాళీగా ఉన్నాయని, కొత్త పరిశ్రమలు రాలేదని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు భూములు కేటాయించడం వల్ల ఆ పేరు చెప్పి బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల దగ్గర రుణాలు ఎగ్గొట్టిన వారికి భూములు కేటాయించడం దుర్మార్గమన్నారు. దీనివల్ల కొత్తగా ఉద్యోగాలు రాకపోగా రైతుల వద్ద సేకరించిన భూమిని రియల్ ఎస్టేట్ పేరుతో లూటీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అనిల్ అంబానీకి భూములు కేటాయించే ప్రతిపాదనలు తక్షణమే విరమించాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు.

## అర్హులందరికీ రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలి

### - కలెక్టర్‌కు సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి

రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామానికిఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పంచదార్ల రెవెన్యూలో ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని కోరుతూ బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు కలెక్టర్‌కు లేఖ రాశారు. కృష్ణంపాలెం గ్రామానికి చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వం ఏపిఐఐసీ 2006లో సేకరించిందని, సదరు భూములకు నష్టపరిహారం కింద ఎకరాకు రూ.5.50 లక్షలు, ఇల్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం చెల్లించి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద పంచదార్ల రెవెన్యూలో 32 ఎకరాల 49 సెంట్ల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. జీఓఆర్‌టి నెంబర్ 846 కేటాయించారని, ఇది జరిగి 18 సంవత్సరాలు కావస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం గ్రామసభ నిర్వహించి వేరేచోట ఆర్ అండ్ ఆర్ కింద స్థలాలు కేటాయిస్తామని చెప్పడం శోచనీయమన్నారు. ఒకే చోట ఇస్తామని గతంలో చెప్పిన ఏపీఐఐసీ, ఇప్పుడు వారిని విడగొట్టి లాటరీ ద్వారా ఎక్కడెక్కడో ఇవ్వడం సరి కాదన్నారు. ఈ విషయాలను పరిశీలించి కలెక్టర్ కృష్ణంపాలెం గ్రామస్తులకు న్యాయం చేయాలని, పంచదార్లలో స్థలాలు కేటాయించాలని కోరారు. అలాగే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇస్తామన్న 8 లక్షల 98 వేలు ఏ మాత్రం సరిపోవని, అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.25 లక్షల నష్ట పరిహారం అందించాలని కోరారు.

## ఆర్‌టిఐతో సమాచారం పొందవచ్చు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ రికార్డుల్లోని సమాచారాన్ని ఆర్టీఐ చట్టంతో ప్రజలు పొందవచ్చని ఆర్టీఐ చట్టం రిసోర్స్‌పర్సన్, ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ స్పష్టం చేశారు. ఏపీ సూక్ష్మ నీటి సాగు పథకం జిల్లా అధికారి కార్యాలయంలో బుధవారం ఆర్టీఐ చట్టంపై జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దరఖాస్తుదారులకు అధికార యంత్రాంగం సమాచారాన్ని నిర్దేశిత గడువులోగా అందజేయాలని, సమాచారాన్ని నిరాకరించదలచినపుడు అందుకు కారణాలను విధిగా తెలియజేయాలని కోరారు. సమాచారం అందించడంలో ప్రజా సమాచార అధికారి విఫలమైతే అప్పీలు చేసుకునే అధికారం దరఖాస్తుదారుకు ఉందని చెప్పారు. ఆర్టీఐ చట్టం ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రశ్నించే అవకాశం ప్రజలకు దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏపీ సూక్ష్మ నీటి సాగు పథకం జిల్లా అధికారి జివి.లక్ష్మి వివిధ సంస్థల జిల్లా సమన్వయకర్తలు పాల్గొన్నారు.

## మునగ సాగుతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : డ్వాక్రా మహిళలు మునగ సాగు చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎంపిడీవో బానోజీరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో మునగ సాగును చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా 110 ఎకరాల్లో సాగుకు రైతులు ముందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రాజుబాబు, ఏపీఓ వరహాలుబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు అమరపిన్ని వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యంగా ఉండి అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విశ్వబ్రాహ్మణులు అంతా ఐక్యతగా ఉండి అభివృద్ధి చెందాలని విశ్వ బ్రాహ్మణ సంఘం చోడవరం నియోజకవర్గ కన్వీనర్ చుక్కా వెంకట సత్తిరాజు అన్నారు. మండలంలోని రాజాం గ్రామంలో బుధవారం సంఘం మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట సత్తిరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సంఘాలుగా ఏర్పడి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కడియం శ్రీనివాస్, యండపల్లి తులసిరావు, చుక్కా ఆచారి, ఎండపల్లి నాగేశ్వరరావు, చుక్కా లక్ష్మణరావు, కోలుమూరు ఆనంద్, పాలవలస భాస్కర్ రావు, భీమవరపు శ్రీను పాల్గొన్నారు.

# స్మార్ట్ విద్యుత్ మీటర్లను అడ్డుకోండి

## సిపిఎం ఆధ్వర్యాన పట్టణంలో ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అదాని స్మార్ట్ విద్యుత్ మీటర్లను తమ ఇళ్లకు బిగించకుండా ప్రజలంతా అడ్డుకోవాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో సిపిఎం నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటరు ఏర్పాటు చేస్తే వినియోగదారులు సెల్‌ఫోన్ మాదిరిగా ముందస్తుగా డబ్బు చెల్లించి రీఛార్జి చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లోనే అదానీ కంపెనీ వారు రీడింగ్ చూసి బిల్లు పంపుతారని, తేడా వస్తే సమాధానం చెప్పే నాధుడు ఉండడని పేర్కొన్నారు. రీఛార్జి చేసుకోవాలని వచ్చే మెసేజ్ చూడకపోయినా, ఆ సమయానికి డబ్బులు లేకపోయినా కరెంట్ వెంటనే ఆగిపోతుందని తెలిపారు. ఇప్పటిలాగ 15 రోజులు గడువు ఉండదని చెప్పారు. అంతేకాకుండా డిమాండ్‌ను బట్టి ఎప్పుడు పడితే అప్పుడు రేట్లు పెంచే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన లోకేష్, కూటమి నేతలు నేడు వాటిని బిగించడం దారుణమన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చెప్పినట్లు రాష్ట్రంలో ఈ విధంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. అందరం కలిసి ఈ స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు బి. ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్య బాబు, ముదిరాజ్ కాలనీ ప్రాంతవాసులు ఓం శివ, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్స్ వల్ల నష్టాలను తెలియజేస్తున్న సిపిఎం నేతలు

# కెప్టెన్ లక్ష్మి సెహగల్‌కు ఘన నివాళి



లక్ష్మి సెహగల్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కశింకోట : ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధురాలు, ఆజాద్ హింద్ ఫౌజ్ మహిళా రెజిమెంట్ నేత, ప్రముఖ సామాజిక కార్యకర్త కెప్టెన్ లక్ష్మీ సెహగల్ 13 వర్ధంతి కార్యక్రమం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన కశింకోటలో బుధవారం నిర్వహించారు. లక్ష్మీ సెహగల్ చిత్ర పటానికి పూలమాలలు వేసిన ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి మాట్లాడుతూ కెప్టెన్ లక్ష్మీ సెహగల్ సుభాష్ చంద్రబోస్ నిర్మించిన ఆజాద్ హిందూ ఫౌజ్ మహిళా రేజిమెంట్ కెప్టెన్‌గా స్వాతంత్ర్య పోరాటం పాల్గొన్న ధీరవనిత అని పేర్కొన్నారు. చిన్నతనంలోనే విదేశీ వస్తు బహిష్కరణ, మద్యం నిషేధం వంటి జాతీయ పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. 1971లో సిపిఎం తరుపున లక్ష్మీసెహగల్ రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 1998లో ఈమెకు పద్మ విభూషణ్ పరిస్కారం ప్రధానం చేయడం జరిగిందని చెప్పారు. 2002లో రాష్ట్రపతి ఎన్నికల్లో ఆమె వామపక్షాల మద్దతుతో బరిలో దిగినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బి.సురలక్ష్మి, ఎ.సత్యవతి, అచ్చియమ్మ, డి.నాగమణి, నూకాలమ్మ, పూర్ణ, నూకరత్నం పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ కొత్త బిల్డింగుల్లో కెప్టెన్ లక్ష్మీ సెహగల్ చిత్ర పటానికి ఐద్వా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా పరవాడ మండల అధ్యక్షురాలు మాన్యాలు బంగారం, కార్యదర్శి తుంపాల అన్నపూర్ణ మాట్లాడుతూ వైద్య విద్యను పూర్తి చేసిన ఆమె, సింగపూర్‌లోని భారతీయ కార్మికుల కోసం వైద్యసేవలు అందించారని తెలిపారు. భారతదేశంలో సామాజిక సేవా రంగంలో తన జీవితం విశేష కృషి చేశారని తెలిపారు. ఆమె త్యాగం, సేవా స్ఫూర్తి, దేశభక్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. వేమన విజ్ఞానకేంద్రం తరుపున ఆమెకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మంగమ్మ, లక్ష్మి, సరోజినీ, అరుణ, వరలక్ష్మి, అబద్ధం, గోపాలరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

## డిజిటల్, నగదు రహిత లావాదేవీలపై అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం : డిజిటల్ చెల్లింపు వ్యవస్థలు, నగదు రహిత లావాదేవీలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా మేనేజర్ డి.రాజేష్, ఎస్‌బిఐ మేనేజర్ డి.రాజశేఖర్ కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం జరిగిన రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్‌నకు వారు ముఖ్య అతిధులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సేవలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. నగదు రహిత లావాదేవీలు వినియోగించేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్, రిసోర్స్ పర్సన్లు ఎస్.హరి, ఎస్.బాలకృష్ణ, ఎన్.గణేష్, పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

### - ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ స్పష్టం చేశారు. స్థానిక దొడ్డి రామానాయుడు కార్మిక కర్షక నిలయంలో బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్మోహన్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ 15 రోజుల నుంచి ప్రభుత్వ హాస్టల్స్, కాలేజీలలో సర్వేలు చేపట్టడం జరిగిందని, ఆ సర్వేల్లో పలు సమస్యలు వెలుగు చూశాయని చెప్పారు. నర్సీపట్నం డివిజన్లో ఎస్టీ బాలికల హాస్టల్స్‌లో సుమారుగా 300 మంది విద్యార్థులు ఉండగా ఒకటే బాత్రూం ఉందని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులకు సరైన పోషకాహారం అందడం లేదన్నారు. తక్షణమే మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి బాలికల బీసీ హాస్టల్‌లో 200 మంది విద్యార్థులకు నాలుగు రూములే ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో ఎస్టీ హాస్టళ్లలో వర్కర్ల పోస్టులను భర్తీ చేయలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి విజయ్, దివాకర్, వెంకటలక్ష్మి, మూర్తి, రూపేంద్ర, శ్రీను, బాలు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శేషు




ప్రజాశక్తి-సబ్బవరం : రేషన్ డీలర్స్ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం ఆరిపాకకు చెందిన రేషన్ డీలర్ కొప్పాక నాగేశ్వరరావు అలియాస్ శేషు ఎన్నికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర రేషన్ డీలర్స్ సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ మేరకు శేషు రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా శేషుకు పలువురు రేషన్ డీలర్లు అభినందనలు తెలిపారు.

## డైట్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించిన కేంబ్రిడ్జ్ లింగ్వాస్కిల్స్ సర్టిఫికేషన్ పరీక్షల్లో డైట్ విద్యార్థులు 50 మందికి పైగా పేజ్-1లో పరీక్ష రాయగా అత్యుత్తమంగా బి2, అంతకంటే పైస్థాయిలలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు అభినందించారు. అంతర్జాతీయ ప్రమాణాల పరీక్షల ద్వారా విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నైపుణ్య పోటీలకు సిద్ధంగా తయారౌతున్నారని వివరించారు. కార్యక్రమ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిన ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హేమంత్ కుమార్ ఎర్రబోలు, సహకరించిన బిందు పార్వతి, ఎం.రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## అచ్యుతానందన్‌కు సిపిఎం నేతల నివాళి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి సంతాప సూచికంగా సిపిఎం నాయకులు అచ్యుతాపురంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీకి, కేరళ రాష్ట్రానికి, దేశానికి చేసిన సేవలను, ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటాలను సిపిఎం నాయకులు కర్రి అప్పారావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము, సీనియర్ నాయకులు కే.రామసదాశివరావు, ఎస్.కన్నునాయుడు, కూండ్రపు సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతానందన్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

## జర్నలిస్టుల హెల్త్ స్కీం ప్రీమియం చెల్లింపునకు కలెక్టర్ సుముఖత

ప్రజాశక్తి-అనకాపల్లి : జర్నలిస్టుల హెల్త్ కార్డుల ప్రీమియం సీఎస్ఆర్ నిధుల నుంచి చెల్లించేందుకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సుముఖత వ్యక్తం చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజెఎఫ్) జిల్లా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఈశ్వరరావు మాట్లాడుతూ గతంలో అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తమకు సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి చెల్లింపులు జరిపి తన వంతు సహాయం అందించారని తెలిపారు. ఈ ఏడాది కూడా సిఎస్ఆర్ నిధులు నుండి ప్రీమియం చెల్లించాలని కోరారు. దీనికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు బి.వెంకటేష్, చాంద్ బాషా, బి.కొండలరావు, పి.నాగ, శేఖర్, గణేష్, గంటా శ్రీను, షణ్ముఖ్, అమీద్ పాల్గొన్నారు.

## సిఎస్ఆర్ చెక్ అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి బంగార్రాజు ఎన్‌టిపిసి సింహాద్రిలో కాంట్రాక్టు కార్మికుడుగా విధులు నిర్వహిస్తూ ఆ గ్రామంలో మే 18న హత్యకు గురయ్యాడు. అతని కుటుంబ సభ్యులు స్థానిక శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబుకు ఆర్థిక సహాయం కోసం అర్జీ సమర్పించిగా, ఆయన తోయాత్సో రేరేఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అచ్యుతాపురం ప్రతినిధులతో చర్చించారు. కంపెనీ ప్రతినిధులు స్పందించి హతుని భార్య మైలపల్లి బంగారమ్మకు పిల్లల చదువు నిమిత్తం సిఎస్ఆర్ నిధులు క్రింద రూ.1,20,760 చెక్కును బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతులు మీదుగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ మురళీధరరావు అందజేశారు.

## మురికి కాలువలో పసికందు మృతదేహం

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న మురికి కాలువలో పసికందు మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. ఇది చూసిన స్థానికులు చలించిపోయారు. పేగు బంధాన్ని సైతం లెక్కచేయకుండా మురుగు కాలువలో పసికందును పడేయడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మురికికాలువలో పసికందు మృతదేహం పడి ఉండడంపై ఐసిడిఎస్, పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆరా తీస్తున్నారు

## వివోఎలు, గ్రామ సంఘాల అధ్యక్షులకు శిక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల మహిళ సమైక్య కార్యాలయంలో బుధవారం గ్రామ సంఘాల అధ్యక్షులు, వివోఏలకు గ్రామ శ్రేయస్సు స్థితి స్థాపక ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎంపీడీవో ఎవి.సువర్ణరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కుటుంబ అవసరాలను గుర్తించేందుకు వివోఏలు, గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సమగ్ర సర్వే చేయాలన్నారు. ఆగస్టు నెలాఖరులోగా ఈ సర్వేను పూర్తి చేయాలన్నారు. వెలుగు ఏపీఎం ప్రభాకరరావు, డాక్టర్ గాయత్రిదేవి పాల్గొన్నారు.

## కొనసాగుతున్న కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సుందరయ్య పేట, పంచాయితీ మొండిపాలెం, కుంచంగి, రొంగాలవాని పాలెం గ్రామాలలో ఉచిత కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు కిడ్నీ వ్యాధితో ఇబ్బంది పడుతూ ఎక్కువమంది మరణిస్తున్న విషయాన్ని గమనించి గ్రామంలో ఉన్న ప్రజలందరికీ సీరం క్రియాటిన్ టెస్టులు చేయించి అందులో వ్యాధి నిర్ధారణ అయిన వారికి మెరుగైన వైద్య చికిత్స చేయిస్తామని చెప్పారు. జిల్లా వైద్యాధికారి హైమావతి, సర్పంచులు, ఎంపీటీసీలు కూటమి నాయకులు, పాల్గొన్నారు.

## విస్సన్నపేట భూ కుంభకోణంపై సమగ్ర విచారణ చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గత ప్రభుత్వ హయంలో అనకాపల్లి జిల్లా కసింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలో విస్సన్నపేటలో చోటుచేసుకున్న భూ కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి దూలం గోపి, నాయకులు అప్పికొండ గణేష్ కలెక్టర్ విజయకృష్ణన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. విస్సన్నపేట గ్రామ సర్వే నెంబర్ 195/2లో 609.24 ఎకరాల విస్తీర్ణంలో గల భూమిలో 2020 సంవత్సరం నుంచి ఈ భూ అక్రమాల వ్యవహారం నిర్విరామంగా కొనసాగుతుందని, దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. సదరు భూ కుంభకోణం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

# భూ సేకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి

### రైతు సంఘం ఆధ్వర్యాన ఎమ్మెల్యేకు పలు గ్రామాల రైతుల వినతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట
బుచ్చయ్యపేట మండలంలో పరిశ్రమల పేరుతో చేపట్టనున్న భూసేకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ మండలంలోని చిన్నమల్లం, పెదమల్లం, భూపతిపాలెం, ఆర్.భీమవరం, ఆర్.శివరాంపురం, అప్పన్నపాలెం, చిన్నభీమవరం గ్రామాలకు చెందిన రైతులు ఏపీ రైతు సంఘంగా ఆధ్వర్యంలో బుధవారం చోడవరంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసుకుంటున్న భూములను భూ సేకరణ పేరుతో తీసుకుంటే వారు రోడ్డున పడతారని తెలిపారు. రైతుల పొట్ట కొట్టే పరిశ్రమల వద్దని పేర్కొన్నారు. భూసేకరణలో నష్టపోయే గ్రామాలలో ప్రజలు ఏ ఒక్కరూ ప్రభుత్వానికి భూములు ఇవ్వడానికి అంగీకరించడానికి సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. అందువల్ల భూసేకరణను ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.వి.నాయుడు, మండల సిఐటియూ నాయకులు పి.సాంబశివరావు, అప్పన్న అశోక్, లోవరాజు, రాము, అప్పన్న త్రిమూర్తులు, అప్పన్న నాగేష్, పంచకర్ల నాగు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

**భూసేకరణ వద్దని ధర్నా**

మండలంలోని ఆర్ భీమవరం, ఆర్ శివరాంపురం, మల్లాం పంచాయతీలలో భూసేకరణ ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుచ్చయ్యపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ పరిశ్రమలు, సెజ్‌లు ఏర్పాటుకు భూసేకరణ చేసే సమయంలో 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు నిర్వహించి, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉండగా, ఆ పని సక్రమంగా చేపట్టకుండా ప్రజలను గందరగోళం చేసి, బలవంతపు భూసేకరణకు పూనుకోవడం దారుణమన్నారు. అందుకే అధికారులు గోప్యంగా సర్వేలు చేస్తున్నారన్నారు. ఇది కేవలం కార్పొరేట్లకు, పారిశ్రామికవేత్తలకు రైతుల భూములను అప్పనంగా దోచి పెట్టే చర్యలేనని పేర్కొన్నారు. ఈ భూ సేకరణ చేపడితే రైతులంతా రోడ్డున పడతారని, జీవనోపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ ఎం.లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు, పలు గ్రామాల ప్రజలు

# టిడిఆర్ బాండ్లు వద్దు

### గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యాన సంతకాల సేకరణ


సంతకాల సేకరణలో మాట్లాడుతున్న కర్రి అప్పారావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం
అచ్యుతాపురం -అనకాపల్లి రోడ్డు విస్తరణలో స్థలాలు, భూములు, ఇల్లు, షాపులు కోల్పోతున్న బాధితులకు టిడిఆర్ బాండ్లు వద్దని, గత ప్రభుత్వ నిర్ణయించిన ధర ప్రకారం పరిహారం నగదు రూపంలో చెల్లించాలని కోరుతూ మండలంలోని చోడపల్లి, మోసయ్యపేట, కొండకర్ల గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యాన సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. నిర్వాసితులు పెద్ద సంఖ్యలో సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము, కో కన్వీనర్ కె.రామసదాశివరావు మాట్లాడుతూ వివిఎంఆర్‌డిఏ ద్వారా టిడిఆర్ బాండ్లు ఇస్తామని ప్రభుత్వం మాట మార్చిందని, టిడిఆర్ బాండ్లు వద్దని నిర్వాసితులంతా ఒకే మాటగా చెబుతున్నప్పటికీ వారి గోడును వినిపించుకోవడం లేదని విమర్శించారు. ఎవరెన్ని మాయ మాటలు చెప్పిన నమ్మొద్దని హితవుపలికారు. టిడిఆర్ వలన మధ్యవర్తులు, బిల్డర్లకు ఉపయోగం ఉంటుంది తప్ప నిర్వాసితులకు కాదని స్పష్టం చేశారు. వెంటనే టిడిఆర్ బాండ్ల ఆలోచన విరమించుకొని 2013 భూ సేకరణ చట్టం కింద పరిహారం చెల్లించాలని, లేదంటే నిర్వాసితులంతా ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి అప్పారావు, కూండ్రపు సోము నాయుడు, ఎస్.కన్నంనాయుడు, బాధితులు కాకి వెంకటేశ్వరరావు, కాకి శంకర్రావు, దమ్ము చండి, అప్పారావు, కొక్కిరా సత్యనారాయణ, నాగేశ్వరరావు, కృష్ణ, రవి, దాసరి రవణమ్మ, నూకలక్ష్మి, ఒడిసెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# లోకేష్‌గారూ.. మా స్కూల్ భవనం మరమ్మతు చేయరూ..

### చేతులెత్తి దండం పెడుతూ గిరిజన విద్యార్థుల వేడుకోలు


స్లాబ్ పెచ్చులూడి శిథిలావస్థలో ఉన్న భవనం


దండం పెడుతూ వేడుకుంటున్న గిరిజన చిన్నారులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తమ పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పరిధి చింతపాక పాఠశాల గిరిజన విద్యార్థులు దండం పెడుతూ వేడుకున్నారు. పాఠశాల భవనం స్లాబ్ పెచ్చులూడిపోయిందని, వర్షం వస్తే కారిపోతుందని, కనీసం కూర్చోడానికి కూడా వీల్లేకుండా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెచ్చులూడి ఎప్పుడు తమపై పడతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఒకప్పుడు ఎయిడెడ్ స్కూల్‌గా ఉన్న ఈ పాఠశాల ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలగా మార్పు చేశారు. ఈ పాఠశాలలో 23 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వేగలపాడు, ఆరిమానగరువు, చింతపాక ఈ మూడు గ్రామాలకు ఈ పాఠశాలే దిక్కు. సింగిల్ టీచర్‌తో నెట్టుకొస్తున్న ఈ పాఠశాలలో అన్నీ సమస్యలే. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ జోక్యం చేసుకొని వెంటనే పాఠశాలకు నిధులు మంజూరు చేసి భవన మరమ్మతులు చేపట్టాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఉపాధి హామీ కూలీలకు, సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు జిల్లాలో ఆరు వారాల నుండి కూలి డబ్బులు చెల్లించలేదన్నారు. కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వడ్డాది నాయుడు, గొర్లి రాజు, ఏడువాక రాజు, ఆర్.శివరాంపురం, ఆర్.భీమవరం, అప్పంపాలెం, రాజాం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


ప్రభుత్వ కార్యక్రమాలు వివరిస్తున్న సాయికృష్ణ తదితరులు

## టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు విజయ్ ఆధ్వర్యాన బుధవారం చేపట్టారు. ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాయకులు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాస్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ దొక్కా నాగభూషణం పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మొల్లి అప్పలరాజు, మొల్లి వెంకునాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ సబ్బి శ్రీను, మల్ల శేషు, సూరిసెట్టి రాము, ఆడారి బాలాజీ పాల్గొన్నారు.

**మాడుగుల** : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడాది కాలంలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరుగా ప్రజల చెంతకే పంపిస్తున్నారని టిడిపి నియోజకవర్గ అబ్జర్వర్ ఏసుదాస్ పేర్కొన్నారు. బుధవారం మాడుగుల పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. టిడిపి నాయకులుప్పాల రమేష్, ఊడి అప్పారావు, నానాజీ, జొన్నపల్లి రమేష్, రాము పాల్గొన్నారు.

## క్రైస్తవుల అభ్యున్నతికి సహకారం అందించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : క్రైస్తవుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని రాష్ట్ర బిషప్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు బిషప్ మోహన్ కుమార్ కాటన్ కోరారు. మండల కేంద్రం దేవరాపల్లిలోని కల్వరి రాక్ చర్చిలో ఏపీ బీసీ సెంట్రల్ కమిటీ సభ్యుడు బంగారి సాల్మన్ రాజు అధ్యక్షతన ఏపి బిషప్ కౌన్సిల్ ముఖ్య సమావేశం బుధవారం జరిగింది. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా బిషప్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులుగా యేసురాజు, శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా బి.యోహాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మోజెస్, డేనియల్, అనంతకుమార్, విజయబాబు, శాంతి కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

## పలు సమస్యలపై వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-యలమంచిలి : స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జనవాహిని కార్యక్రమం నిర్వహించారు. అధికార్లతో పాటు జనసేన పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని పలు సమస్యలు విన్నవించారు. ఎమ్మెల్యే విజయకుమార్ అర్జీలు స్వీకరించారు. మున్సిపాలిటీ పరిధిలోని అప్‌గ్రేడ్ అయిన పెద్దపల్లి హైస్కూల్‌లో తరగతి గదుల నిర్మించాలని బొద్దపు శ్రీనివాసరావు విన్నవించగా, విద్యాశాఖ, రెవెన్యూ అధికార్లతో చర్చించి తగిన పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాజాన శేషగిరిరావు, ఇత్తంశెట్టి సన్యాసిరావు, రమేష్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలి

## కంచం మోగిస్తూ నిరసన తెలిపిన నిర్వాసితులు



నిరసన చేపడుతున్న నాయకులు, నిర్వాసితులు

**ప్రజాశక్తి- నక్కపల్లి:**మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులు ఆర్ఆర్ ప్యాకేజీ 25 లక్షలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని భూసేకరణ ప్రభావిత గ్రామాల్లో బుధవారం రాత్రి గరిటతో కంచం మోగిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మండలం లో మూలపర్ర, పాటిమీద, తుమ్మల పేట, తమ్మయ్యపేట గ్రామాలలో ని గరెటలతో కంచాలు మోగించి నిరసన వ్యక్తం చేశారు. ఇల్లులు కోల్పోతున్న కుటుంబాల్లో 18 సంవత్సరాల నుండి వారందరికీ, వివాహమైన మహిళలలకు కూడా ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా వెంటనే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ట్రైనింగ్ ఇచ్చి ప్రస్తుతం జరుగుతున్న పనులలో కూడా స్థానికులకు ఉపాధి కల్పించాలని, ప్రతీ ఒక్కరికీ ఆర్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బల్క్ డ్రగ్స్ కంపెనీలు ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని, ఆగష్టు 6 వ తేదీన నక్కపల్లి తహాశీల్దార్ కార్యాలయం వద్ద జరప తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 25 లక్షలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నాయకులు సూరకాసుల గోవింద్, తళ్ళ భార్గవ్,రావి అప్పారావు పాల్గొన్నారు.



సరిహద్దులు ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

## నూకతాత మాన్యం భూమి సరిహద్దులు ఏర్పాటు

**ప్రజాశక్తి -నక్కపల్లి:**మండలంలో రాజయ్యపేటలో గ్రామ దేవత నూకతాత మాన్యం భూమికి బుధవారం గ్రామస్తులు సరిహద్దులు ఏర్పాటు చేశారు. వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్లో భాగంగా బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు మౌలిక వసతులు కల్పనలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. నూక తాత మాన్యం భూమిలో ఎటువంటి పనులు చేపట్టకుండా, భూమి ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు ఆలయ పూజారులు పిక్కి తాతీలు, ఎక్కి దేవుడు ఆధ్వర్యంలో నూక తాత ఆలయానికి ఇరువైపులా , రోడ్డుకు ఆనుకుని కర్రలు పాతి జెండాలు కట్టి గ్రామస్తులు సరిహద్దులు ఏర్పాటు చేశారు. నూకతాత మాన్యం భూమిలో పనులు చేపడుతున్నారని, అందుకని సరిహద్దులు ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. నూక తాత మాన్యం భూమిలో ఎటువంటి పనులు చేపట్టొద్దని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, రాజయ్యపేట టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, చోడిపల్లి అప్పన్న, గోపి, రామకృష్ణ, చోడిపల్లి కోదండరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇ సునీల్కుమార్

## 'సూర్య ఘర్'ను వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి-కోటవురట్ల:** పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ డీఈ సునీల్ కుమార్ సూచించారు. బుధవారం రాజుపేట గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు, సూర్య ఘర్ పథకం ద్వారా విద్యుత్తు ఆదాతో పాటు ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు.లబ్ధిదారులకు రుణ సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు, మూడు కేటగిరీలో ఉండే ఈ పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఈ పరమేశ్వరరావు, లైన్ ఇన్స్పెక్టర్ సత్తిబాబు, వల్లి, తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల మధ్య తుప్పలతో భయాందోళన



పేరుకు పోయిన తుప్పలు

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:** మున్సిపాలిటీ గరకాలమ్మ వీధిలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో తుప్పలు పేరుకు పోయి ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లలోకి పాములు, పురుగులు ప్రవేశించడంతో బిక్కుబిక్కు మంటూ జీవితాన్ని గడుపుతున్నారు. బుధవారం స్థానికులు తెలియజేసిన వివరాలు ప్రకారం... నర్సీపట్నం మున్సిపాలిటీ పెద్ద బొడ్డేపల్లిలో గల గరగాలమ్మ వీధిలో ఖాళీ ఇళ్ల స్థలాల్లో మనిషి ఎత్తున నిలువెత్తు తుప్పలు పెరిగి పొదలతో నిండిపోయి ప్రమాదకరంగా మారాయన్నారు. వర్షాలకు స్థానికుల ఇళ్లలోకి పాములు ప్రవేశిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సాయంత్రం పూట బయటకు రావాలంటేనే భయపడిపోతున్నామన్నారు. డ్రైనేజీ, రోడ్లు ఏర్పాటు చేయకుండానే బహుళ అంతస్తు భవనాలకు అనుమతులు ఇవ్వడంతో ఖాళీ ఇళ్ల స్థలాల్లో తుప్పలు పేరుకుపోయి ఈ పరిస్థితి ఏర్పడిందని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.



పరిశీలిస్తున్న అధికారులు

## పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

**ప్రజాశక్తి -నక్కపల్లి:**గ్రామాల్లో పారిశుధ్య పనుల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు సూచించారు. మండలంలో బుధవారం గుల్లిపాడు, రమణయ్యపేట రేబాక, వేంపాడు గ్రామాల్లో పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీ సర్పంచ్లు, మెడికల్ సిబ్బందితో కలిసి గ్రామాల్లో ఇంటింటా పరిశీలించి, పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో పాటు, దోమల బెడద ఎక్కువగా ఉండటంతో డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రతిరోజు శానిటేషన్ పనులు చేయించాలని, వాటర్ ట్యాంకుల్లో క్లోరోనేషన్, దోమలు ప్రబలకుండా దోమల మందు ముందు పిచికారి చేయించాలని పంచాయతీ కార్యదర్శిలకు సూచించారు. గుల్లిపాడులో ఎంపీపీ స్కూలును ఎంఈఓ నరేష్తో కలిసి సందర్శించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజేష్

## వినాయక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** పట్టణంలోని అయ్యరక వీధి అబీద్ సెంటర్ వద్ద ప్రతీ ఏటా శ్రీ నూకంబిక యూత్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బుధవారం మున్సిపాలిటీ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ చేతుల మీదుగా ఉత్సవాల పోస్టర్, గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలనే వాడాలని పిలుపునిచ్చారు. యూత్ ప్రెసిడెంట్ కర్రి చిన్న మాట్లాడుతూ, ఆగస్టు 27న శ్రీ సిద్ధి వినాయక స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, 31న లక్ష్మీ గణపతి హెూమం వైభవంగా జరగనుందని కోరారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 3 బుధవారం సాయంత్రం 5 గంటలకు దీపారాధన, 6న అన్నసమారాధన, 10న వినాయక స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకాంబిక యూత్ కమిటీ నెంబర్స్, కర్రీ అప్పారావు, పెదిరెడ్ల జోగారావు, పెదిరెడ్ల కిరణ్ కుమార్, లంక వెంకటేష్, చిత్తా అప్పారావు పాల్గొన్నారు.

# వరి నారు చిగుళ్లు తుంచి నాటుకోవాలి




చౌడువాడలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** వరి నారు చిగుళ్ల తుంచి నాట్లు వేసుకోవాలని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి ఆదిలక్ష్మి తెలిపారు. మండలంలోని చౌడువాడ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నారు చిగుళ్ల కత్తిరించడం వల్ల నాట్లు వేసిన వెంటనే వచ్చే కాండం తొలిసే పురుగును నివారించుకోవచ్చని చెప్పారు. వరి నారు తీసే వారం నుండి పది రోజులు ముందు ఎకరా నారుమడికి త్రీజీ గుళికలను ఒకటిన్నర కిలోలను వేసుకుంటే వరి నాకు పురుగులు సోకకుండా ఉంటాయని తెలిపారు. దమ్ములో డిఎపి 50 కిలోల బస్తాతో పాటు 10 కిలోల యూరియా వేసుకోవాలని సూచించారు. 20 కిలోల జింకు సల్ఫేట్ను ఆఖరి దమ్ములో వేసి కలియ దున్నుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో ఆర్ఎఆర్ఎస్ చెరకు ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డి ఉమామహేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

**దేవరాపల్లి :** మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో వరి సాగు పద్ధతులపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు బుధవారం వరి పొలాలను సందర్శించి పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ, ఆర్ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు అదిలక్ష్మి, చంద్రశేఖర్, ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

**గొలుగొండ:** మండలంలోని సీహెచ్.నాగాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధారాణి పాల్గొని రైతులకు అవసరమైన మార్గదర్శకాలను అందించారు. గ్రామ సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు మాట్లాడుతూ, వరి పంటలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై సమగ్రమైన సమాచారం అధికారుల నుంచి పొందాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు నాటడం ద్వారా దిగుబడి బాగుంటుందన్నారు.

**రావికమతం:** వ్యవసాయ సాగులో రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయ అధికారుల నుండి తగు సూచనలు సలహాలు తీసుకొని ముందుకు సాగాలని రావికమతం మండల వ్యవసాయ అధికారి రమేష్ బాబు తెలిపారు. మండలంలో దొండపుడి గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రమేష్ బాబు మాట్లాడుతూ, వరి నారుమడులలో అగ్గి తెగులు, పొడతెగులు ఆశించడం జరుగుతుందని, వీటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దొండపూడి వ్యవసాయ సహాయకురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.




రావికమతంలో అవగాహన కల్పిస్తున్న ఎఒ

## పాఠశాలల్లో ఆర్జెడి తనిఖీలు

**ప్రజాశక్తి-దుంబ్రిగుడ:**విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసకుంటామని ఆర్జేడీ విజయభాస్కర్ హెచ్చరించారు. మండలంలోని తూటంగి ప్రాథమికోన్నత, కస్తుర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావుతో కలిసి పర్యవేక్షించారు.. ఆయా పాఠశాలల్లో చిన్నారులకు అందుతున్న విద్య ప్రగతితోపాటు మండల విద్యాశాఖ కార్యాలయం, పాఠశాలల్లో విద్యుత్తు సౌకర్యం, హాజరు శాతంపై క్షుణంగా పరిశీలించారు. సమయపాలనతోనే విద్యాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న సిఐ రేవతమ్మ

## డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

### -మద్యం సేవిస్తున్నవారిని పట్టుకున్న పోలీసులు

**ప్రజాశక్తి- నర్సీటప్నంటౌన్:**డ్రోన్ కెమెరాలతో జూదం, మత్తు పానీయాలు సేవిస్తున్న వారిని రూరల్ పోలీసులు భరతం పడుతున్నారు. బుధవారం రూరల్ సీఐ రేవతమ్మ నేతృత్వంలో రూరల్ ఎస్ఐ పి. రాజారావు, సిబ్బందితో నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నీలంపేట, సాదుపాకల, గబ్బాడ గ్రామాలు, గొలుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాకలపాడు గ్రామాలలో డ్రోన్ కెమెరాల సహాయంతో ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టారు. సాధుపాకల ప్రాంతంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఆరుగురిని డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రాజారాం

## ప్రజల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి -మాడుగుల:** సమస్యలు పరిష్కారం దశగా ప్రతి ఒక్క అధికారి పని చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు తాళపరెడ్డి రాజారామ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కొంకి అప్పారావు అధ్యక్షతన జరిగిన సచివాలయ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పనులపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పనులు చేసి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆటల్లో మేటి..

- గణేష్ పట్టుదల ముందు తలొగ్గిన వైకల్యం
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విభిన్న ప్రతిభావంత విద్యార్థి సత్తా

**ప్రజాశక్తి-రావికమతం:** వైకల్యం వైఫల్యం కాదు. తీర్చిదిద్దే వారికి సంకల్పం ఉంటే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో కూడా ప్రతిభను వెలికి తీయవచ్చు. భావానుగుణంగా స్పందించేలా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తగిన ప్రత్యేక శిక్షణను అందించడంతో 100శాతం లోపాలు ఉన్న విభిన్న ప్రతిభావంత పిల్లలు కూడా వారికి ఇష్టమైన రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారు.

అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొమిర గ్రామానికి చెందిన అప్పికొండ గణేష్ నిరు పేద కుటుంబం. తల్లిదండ్రులు అప్పారావు, సత్యవతి వ్యవసాయ కూలి పనులే జీవ నాధారం. ఎనిమిదేళ్ల వయసులో గణేష్‌లోని వైకల్యం బయటపడింది. దీంతో, తల్లడిల్లిన తల్లిదండ్రులు గుండె దిట్టం చేసుకొని కుమారుడిని రావిమకతం భవిత కేంద్రానికి పంపారు. అక్కడి ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు ప్రత్యేక శిక్షణ ఇచ్చి తోడ్పాటును అందించారు. గణేష్ మేధో వైకల్యం, వినికిడి లోపంతో బాధపడుతున్నా ఆత్మ స్థైర్యం కోల్పోకుండా మొక్కవోని ధైర్యంతో ఆటల పోటీలలో విశేష ప్రతిభ కనబరుస్తూ మండల స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు క్రీడల్లో రాణిస్తున్నాడు.జాతీయ స్థాయి యూనిఫైడ్ వాలీబాల్ స్పెషల్ ఒలంపిక్స్ భారత్ క్రీడా పోటీల్లో అప్పికొండ గణేష్ అద్భుతంగా ఆడి బ్రాంజ్ మెడల్ సాధించాడు.



మెడల్, సర్టిఫికెట్‌ను ఇస్తున్న సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి జయప్రకాష్‌నాయక్

మండల స్థాయిలో దివ్యాంగుల క్రీడాపోటీలలో పరుగు పందెంలో గణేష్ మొదటి బహుమతి గెలుచుకొని, మండల విద్యాశాఖాధికారి చేతుల మీదగా బహుమతులు అందుకున్నాడు. జిల్లా స్థాయి పరుగు పందెంలో ద్వితీయ స్థానాన్ని పొంది సిల్వర్ మెడల్ చేజిక్కించుకున్నాడు. రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలంపిక్స్ భారత్ 2025 దివ్యాంగుల వాలీబాల్ క్రీడా పోటీల్లో గణేష్ ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం సాధించాడు.జాతీయ స్థాయిలో గత నెల 15 నుండి 19వ తేదీ వరకు గుజరాత్ లోని అహ్మదాబాద్ లో జరిగిన జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ యూనిఫైడ్ వాలీబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ తరపున వెళ్ళిన టీంలో గణేష్ అద్భుతంగా ఆడి కాంస్య పతకం సాధించాడు.



వాలీబాల్ ఆడుతున్న గణేష్

### పోత్సహిస్తే ఏదైనా సాధిస్తారు

దివ్యాంగ విద్యార్థులకు సమగ్రాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుంది. ప్రోత్సహించి తగిన శిక్షణను అందించడంతో గణేష్ వంటి మానసిక దివ్యాంగ విద్యార్థి సైతం రాష్ట్ర, జాతీయస్థాయి స్పెషల్ ఒలంపిక్ క్రీడా పోటీల్లో గెలుపొంది సాధారణ విద్యార్థులతో సమానమే అని నిరూపించాడు.



**మహాలక్ష్మి నాయుడు**
**,ప్రత్యేక ఉపాధ్యాయులు,**
**స్పెషల్ ఒలింపిక్ భారత్ కోచ్**

## రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

### -మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్

**ప్రజాశక్తి- రావికమతం:**కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఏమి చేయలేదని, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. మండలంలో కవగుంట గ్రామంలో జరిగిన ఒక ప్రైవేట్ ఫంక్షన్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులను టార్గెట్‌గా పెట్టుకొని పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. ఎటువంటి కేసులకు , బెదిరింపులకు వైఎస్ఆర్సిపి శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని ఆయన తెలిపారు. రేపు రానున్న రోజుల్లో మరలా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడనున్నదన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇంటి నుంచి బయటికి వస్తే లక్షల మంది ప్రజలు ఆయన్ని చూసేందుకు ఎంతో అభిమానంతో ఆయన వెంట నడుస్తున్నారన్నారు. కాబట్టి నియోజకవర్గంలో ప్రతీ కార్యకర్త, ప్రతి అభిమాని ధైర్యంగా కష్టపడి పనిచేయాలని,మీకు ఎటువంటి ఆపద వచ్చిన మీ వెంట తాము ఉన్నామని, ఎటువంటి ఉడత బెదిరింపులకు ఏ ఒక్కరు భయపడనవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మి నాయుడు, మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాధరావు, తలారి ఆదిమూర్తి, మాజీ మండల ఉపాధ్యక్షులు గంట ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ భవాని ప్రసాదు, కొత్తకోట ఎంపిటిసి దేవ, సర్పంచ్ గణేష్, మాజీ డిసిఎంఎస్ డైరెక్టర్ దేవ పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్షరాస్యతకు 'అక్షరాంధ్ర'

### -జిల్లా కలక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి 'అక్షరాంధ్ర' ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. అక్షరాంధ్ర జిల్లా కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమంలో జిల్లాలో 78 వేలా 676 మంది 15 నుండి 59 సంవత్సారాల వయసు గల వయోజనులను గుర్తించినట్లు తెలిపారు. వీరందరినీ మార్చి 2026లోగా అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. 2029 నాటికి నూరు శాతం అక్షరాస్యత జిల్లాగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పది మందికి ఒక వాలంటరీ టీచరును నియమించాలని, తరగతుల నిర్వహణకు గ్రామ, వార్డులలో అంగన్వాడి కేంద్రాలు, కమ్యూనిటి కేంద్రాలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. తరగతులు ప్రతిరోజు సాయంత్రం వేళల్లో 5 నుంచి 7 గంటలలోపు నిర్వహించాలని తెలిపారు. 15 గంటలు ఆడియో విజువల్ ద్వారా, 40 గంటలు క్లాస్ రూము తరగతులు, 45 గంటలు అభ్యాసన కార్యక్రమాలు చేయాలన్నారు. అక్షరాస్యతా తరగతులకు హాజరై విద్యావంతులైన వారందరికీ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా మార్చి నెలలో సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సుబ్రహ్మణ్యం వర్మ, సత్యవేణి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి

### కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ఎన్‌టిఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక వసతుల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. 2026 మార్చి నాటికి అన్ని ఇళ్లు పూర్తి కావాలని నిర్దేశించారు. రోజువారీ లక్ష్యాలు పెట్టుకొని పని చేయాలని, పురోగతి సాధించాలని సూచించారు. బుధవారం హౌసింగ్, స్పెషల్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లో లేఅవుట్ వారీగా సమీక్షించారు. లక్ష్యాలపై దృష్టి సారించాలని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఇళ్ల నిర్మాణాల పనులు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. లక్ష్య సాధనలో విఫలమైన అధికారులు, సిబ్బందికి మూడు దఫాలు మెమోలు, షోకాజ్ నోటీసులు ఇవ్వాలని, అప్పటికీ పురోగతి లేకపోతే సస్పెండ్‌కు రిఫర్ చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

#### ఇళ్లు కట్టకపోతే పట్టా రద్దు

ప్రస్తుతం లబ్ధిపొందిన వారికి మరొక పథకంలో ఇళ్లు కానీ, స్థలం కానీ రాదని కలెక్టర్ స్పష్టం చేశారు. మంజూరైన ప్రతి ఒక్కరి చేతా ఇళ్లు కట్టించి తీరాల్సిందేనని అధికారులను ఆదేశించారు. అప్పటికీ ఇళ్లు కట్టడానికి ఆసక్తి చూపకపోతే సంబంధిత లబ్ధిదారుల పట్టాను, ఇల్లును రద్దు చేస్తామని స్పష్టంగా విడమరిచి చెప్పాలన్నారు. విద్యుత్, తాగునీరు, డ్రెయిన్లు, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాపాయి సంతపాలెం, విజయపాలెం లేఅవుట్లలో అప్రోచ్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఇళ్ల వివరాలను తెలుపుతూ నివేదిక సమర్పించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, ఈఈ శ్రీనివాసరావు, డిఇలు, ఇలు, లేఅవుట్ ఇన్చార్జి అధికారులు పాల్గొన్నారు.